రచన - జూన్ 2002

# రామకృష్ణుని కాళీధ్యానంలో.....

ఆంధ్ర భోజుడు శ్రీకృష్ణదేవరాయలు తన నిశిత దృష్టుల్ని రాజదర్బారు నలువైపులా సారించాడు. ఆయన గంభీర వదనం చూసి సభికులు ఆందోళన చెందారు. మహామంత్రి తిమ్మరుసు చిద్విలాసంగా రాయలవారి ముఖభంగిమల్ని పరిశీలిస్తున్నాడు. కావ్యశృంఖలాలతో కృష్ణరాయని బంధించి, ఓ ప్రత్యేకమైన అభిమానాన్ని చూరగొని అధికారాన్ని సంపాదించిన అష్టదిగ్గజాలు రాయల గంభీర వదనాన్ని చూసి, ఏదో రాజ్యవ్యవహారానికి సంబంధించిన విషయమై యుంటుందని నిమ్మకు నీరెత్తినట్టు కూర్చున్నారు. కాని రాయలు మాట విన్న వారికి, ఒక్కసారిగా గుండెల్లో రాయి పడ్డది.

"మీరందరూ ఎన్నో మహాకావ్యాలు వ్రాశారు. మీ సాంగత్య ఫలితం వల్లా, సరస్వతి కృపాకటాక్షాల వల్లా నేనూ అముక్తమాల్యద కావ్యకర్తగా మీ అందరి అభిమానాన్ని చూరగొన్నాను. కాని మనలో ఎవరూ ప్రత్యేకించి విజయనగర సామ్రాజ్య వైభవాన్ని గురించి ఏమీ వ్రాసినట్టు లేదు!"

అల్లసాని పెద్దనా, ముక్కు తిమ్మనా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. ధూర్జటి, భట్టుమూర్తులు పైకప్పు కేసి చూడసాగారు. మల్లన, సూరనార్యులు నేల చూపులు చూశారు. రామభద్రుడు యిబ్బందిగా తన ఆసనంలో కదిలాడు. తెనాలి రామకృష్ణుడు లేచి నిల్చుని, చేతులు కట్టుకొని అన్నాడు.

"ప్రభూ! తమరు మన్నిస్తారన్న ధైర్యంతో మనవి చేసుకొంటున్నాను. చెడులేనిదే మంచి విలువ తెలియదు. గడ్డిపువ్వు లేనిదే గులాబీల అందమూ, సన్నజాజుల సువాసనా ఖ్యాతి చెందవు. కావ్యాలు చక్రవర్తుల సాహిత్యపోషణకు సాక్ష్యాలుగా నిలుస్తాయి. కాని చరిత్రకు

కాదు. యుద్ధం లేనిదే చరిత్ర లేదు. యుద్ధరహితమైన చరిత్ర గణుతికెక్కదు. సాహిత్య చక్రవర్తుల లాగానే కాకుండా సామ్రాజ్య చక్రవర్తులుగా కూడా పేరొందాలంటే రణరంగంలో భాసిల్లాలి. విజయపరంపరలలో తేలియాడాలి. శత్రురాజుల గుండెల్లో నిద్రించి వారిని నిద్రకు కరువు చెయ్యాలి. రాజ్యంలో అవినీతి నిర్మూలనని కఠిన హృదయంతో చేబట్టాలి. విజయనగర సామ్రాజ్య వైభవాన్ని గురించి వ్రాయాలంటే చరిత్ర సృష్టించాలి. అది మేము కలం పట్టి సృష్టించేకన్న, మీరు కత్తి పట్టి సృష్టిస్తే చాలా అద్భుతంగా ఉంటుంది!"

సభాభవనంలో నిశ్శబ్దం ఆవరించింది. అంతవరకూ చిద్విలాసంగా కూర్చున్న మహామంత్రి తిమ్మరుసు ఒకసారి సర్దుకుని కూర్చున్నాడు. రాయలు మంత్రి తిమ్మరుసు వదనంలోకి చూసి, రామకృష్ణుని మాటల వల్ల తిమ్మరుసులో కలిగిన భావాల్ని చదవడానికి ప్రయత్నించాడు. అది సాధ్యం కాకపోవడంతో, అలానే నిల్చుని ఉన్న రామకృష్ణుడి వైపు చూస్తూ, "రామకృష్ణా! నీ పన్ను మాటలలో నిజం లేదనను. కాని అప్పాజీ మౌనం దాల్చారే! కత్తి పట్టడానికి నేను సిద్ధమే. అయినా, మహామాత్యులవారి సలహా లేనిదే ఆ పని సాధ్యం కాదు!" అన్నాడు నవ్వుతూ.

రామకృష్ణుడన్న మాటలకు భయపడిన పెద్దనార్యుడు గండం గడిచినందుకు దీర్ఘ నిశ్వాసం విడుస్తూ, రామకృష్ణుని వైపు మందలింపుగా చూశాడు.

మహామంత్రి తిమ్మరుసు తన గంభీర స్వరంతో అన్నాడు.

"తెనాలిరామా, నీ కోతి బుద్ధులు పోనిచ్చుకొన్నావు కాదు! జన నాశనంతో కూడిన యుద్ధం చరిత్రకు శోభని తెస్తుందేమోకాని దేశానికి కాదు. ఆక్రమణదారుల నెదిరించడానికి యుద్ధం చెయ్యాలి కాని, ఆక్రమణ కోసం కాదు. కారణం లేకుండా కయ్యానికి కాలు దువ్వి విజయం సాధిస్తే, అవతలి వాడు బలం పుంజుకుని ప్రతీకారం కోసం యుద్ధం చేస్తాడు. నిరంతరమూ యిలానే కొనసాగే రణరీతిలో నేల మీద కొత్త గీతలూ, అవి సరిహద్దులుగా కొత్త రాజ్యాలూ ఏర్పడుతూ ఉండినా, ఇరువైపులా అపార జననష్టం కలుగుతూ ఉంటుంది. ఏ విషయంలోనైనా శాంతి, రాయబారం విఫలమైనప్పుడూ, ధర్మం మన పక్షంగా ఉన్నప్పుడూ మాత్రమే సమరనీతి నుపయోగించాలి. అవునూ, ఇంతకీ విజయనగర సామ్రాజ్య చరిత్ర నీకేపాటి తెలుసునయ్యా?"

"ఏదీ, ఈ రాజ్యములో అడుగు పెట్టిన దినాన్నుంచీ రాయలవారు నన్ను చతురోక్తులకే వినియోగించుచున్నారు! పెద్దనార్యులు కావ్యరచనా పర్యవేక్షణతో అనుదినమూ నా ముక్కు రాపాడించుచున్నారు! సామ్రాజ్య చరిత్ర తెలుసుకొనుటకు అవకాశమే కలుగలేదు మహామంత్రీ!" అన్నాడు రామకృష్ణుడు.

రాయలు పెద్దన వైపు చూశాడు.

పెద్దన గొంతు సవరించుకొని, "తెనాలిరామా, కాళీవరప్రసాదుడివి – కళ్ళు మూసుకొని ధ్యానం చెయ్యి. ఈ సామ్రాజ్య చరిత్ర నీకు తెలుస్తుంది" అన్నాడు.

"ఈ క్షణంలోనే ఆ ధ్యానంలో మునిగెదను..." అని యింకా ఏదో అనబోతున్న రామకృష్ణుని వారించి రాయలు ఆనాటి సభ ముగించాడు.

ఆ సాయంత్రం, రామకృష్ణుడు సంధ్యావందనాదులు ముగించుకొని ధ్యాన నిమగ్నుడైనాడు.

❁ ❁ ❁

తుంగభద్రా నదీతీరంలో చాతుర్మాస దీక్షలో ఉన్న శృంగేరీ పీఠాధిపతీ, శంకరాద్వైత ప్రచారకుడూ అయిన మాధవాచార్యులు ఓ సాయంత్రం ఓ వింత దృశ్యాన్ని చూడ్డం తటస్థించింది. ఓ వేటకాడు తన వేట కుక్కల గుంపుతో ఆ ప్రాంతంలో తచ్చాడుతున్నాడు. వాటిలో ఒక వేటకుక్క దూరంగా ఉన్న పొదలో కలిగిన సంచలనం చూసి అటువైపు ఉరికింది. ఆ పొదలోంచి ఓ కుందేలు సింహం మాదిరిగా ఆ వేటకుక్క మీదకు లంఘించింది. వేటకుక్క తోక ముడిచి పరుగెత్తి తన నాయకుని చేరుకొంది.

మాధవచార్యుల ముఖం విప్పారింది. ఈ నేల తేజోవంతులూ, శక్తిమంతులూ అయిన నాయకులకి అలవాలం కావాలెనన్న ధృఢ నిశ్చయం అయన మదిలో ఆ క్షణంలో నాటుకొంది. దానికి కారణం లేకపోలేదు. ఆంధ్ర రాజ్యాన్ని శాతవాహనులూ, యిక్ష్వాకులూ, పల్లవులూ, రాష్ట్రకూటులూ, చోడులూ, చాళుక్యులూ, కాకతీయులూ, వెలమ నాయకులూ, రెడ్డి రాజులూ పరిపాలించిన తదనంతరం, హైందవ సంస్కృతుల పునరుద్దరణకు కంకణం కట్టవలెనన్న సంకల్పం ఆయనలో ఏనాటి నుంచో ఉన్నది. ఆ ప్రాంతంలో తన ఇష్టదైవమైన విరూపాక్షస్వామిని ప్రతిష్ఠించి ఆ స్థలానికి విద్యానగరమని నామకరణం చేశాడు. మాధవాచార్యులు విద్యారణ్య స్వామిగా వినుతికెక్కాడు.

కాకతీయ సామ్రాజ్యం ప్రభలో ఉన్న సమయంలో, ఆ రాజ్యపౌరుడు సంగముడనే యోధుని అయిదుగురు కుమారులలో హరిహరరాయలు, బుక్కరాయలు ప్రతిభావంతులు. వారు కాకతీయ రాజ్య కోశాగారంలో ఉన్నత పదవులు చేసేవారు. ఆ రాజ్యపతనం తర్వాత వారు 'ఆనెగొంది' సంస్థానాధీశుల కొలువులో చేరి అచటి రాచకన్యలను వివాహమాడారు. ఢిల్లీ సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్ 1324లో ఆనెగొంది మీద చేసిన దాడిలో వీరివురూ బందీలయ్యారు. తుగ్లక్ వారిని ఢిల్లీ తీసుకుపోయాడు. వారిలోని ప్రతిభాపాటవాలను గుర్తించిన తుగ్లక్, వారిని ఆనెగొందికి తన ప్రతినిధులుగా పంపాడు. మార్గదర్శిగా, గురువుగా విద్యారణ్యస్వామి ఈ ఇరువురు సోదరులకూ వ్యవహరించి, 1336వ సంవత్సరంలో విజయనగర రాజ్య స్థాపనకు కారకుడైనాడు. 1336 నుంచి 1354 వరకూ హరిహరరాయలూ, 1354 నుండి 1377 వరకూ బుక్కరాయలూ రాజ్యపాలన గావించి విద్యారణ్యస్వామి మంత్రిత్వంలో సామ్రాజ్యాన్ని సుస్థిరం చేశారు. తరువాత అనేక మంది సంగమ ప్రభువులు రాజ్యం చేశారు.

1426 నుంచి 1446 వరకూ రాజ్యపాలన చేసిన ప్రౌఢదేవరాయలు శ్రీనాథ మహాకవికి కనకాభిషేకం చేయించాడు. ప్రౌఢదేవరాయల రెండవ కుమారుడు తన సోదరుని తదనంతరం1456 నుంచి 1485 వరకూ రాజ్యపాలన చేశాడు. ఇతనిని రెండవ విరూపాక్షరాయలుగా వ్యవహరించేవారు. బహు క్రూరుడు, హింసాప్రకృతి కలవాడు, లోకకంటకుడుగా పాలించాడు.

చంద్రగిరి రాజు సాళువ నరసింహరాయలు అత్యంత ప్రతిభావంతుడు. న్యాయవర్తనుడు, తాళ్ళపాక అన్నమయ్య సమకాలీనుడు. ఆయనకు అత్యంత స్నేహపాత్రుడు. ప్రజా క్షేమాన్ని కోరిన నరసింహరాయులు రెండవ విరూపాక్ష రాయలను పదవీచ్యుతుణ్ణి చేసి, విజయ నగరానికి రాజైనాడు. 1336 నుంచి 1485 వరకూ సంగమ వంశీయుల పాలనలో ఉన్న విజయనగర సామ్రాజ్యం సాళువ వంశరాజుల ఆధీనంలోకి వచ్చింది. నరసింహరాయలు 1485 నుంచి 1490 వరకూ ఆరు సంవత్సరములు పాలనలో ఉన్నాడు. సాళువ తిమ్మరుసు అనే బ్రాహ్మణుడు ఈయన వద్ద మంత్రిగా ఉండేవాడు. ఆయనే తరువాత మహామంత్రి తిమ్మరుసుగా ఖ్యాతి నొందాడు.

తుళువ వంశానికి చెందిన ఈశ్వరనాయకుని కుమారుడు నరసనాయుడు సాళువ నరసింహరాయల సేనాపతిగా ఉండేవాడు. నరసింహరాయల అనంతరం, ఆయన కుమారులు తిమ్మరాజు, రెండవ నరసింహరాయలు చిన్నవారగుటచేత వారికి రాజప్రతినిధిగా వ్యవహరించాడు. రెండవ నరసింహరాయలు 1490 నుంచి 1506 వరకూ సింహాసనం మీద ఉన్నాడు. ఈయనకు రాజప్రతినిధిగా నరసనాయకుడు 1490 నుంచి 1503 వరకూ ఉన్నాడు.

తుళువ నరసనాయకుని ప్రథమ పుత్రుడు వీరనరసింహరాయలు తండ్రి తదనంతరం రెండవ నరసింహరాయలకు 1503 నుంచి 1506 వరకూ రాజప్రతినిధిగా వ్యవహరించి, అటుపైన తానే ప్రభువుగా ప్రకటితుడై 1506 నుంచి 1509 వరకూ రాజ్యమేలాడు. ఈ విధంగా విజయనగర రాజ్యపాలన సాళువ వంశం నుంచి తుళువ వంశంలోకి మారింది.

నరసనాయకునకు నలుగురు పుత్రులు. వారిలో మొదటివాడు పైన చెప్పిన వీర నరసింహరాయలు. మిగిలిన ముగ్గురూ శ్రీకృష్ణదేవరాయలు, అచ్యుతదేవరాయలు, రంగారాయలు. శ్రీకృష్ణదేవరాయలు 1474లో జన్మించాడు. తిమ్మరుసు మంత్రి శ్రీకృష్ణదేవరాయల్ని చిన్నతనం నుంచీ తీర్చిదిద్దసాగాడు. రాజకీయ పరిజ్ఞానాన్ని కలిగించసాగాడు. తిమ్మరుసు పర్యవేక్షణలో శ్రీకృష్ణదేవరాయలు తన శక్తిసామర్థ్యాలకు మెరుగుపెట్టుకోసాగాడు. తిమ్మరుసును అప్యాయంగా 'అప్పాజీ' అని సంబోధించేవాడు.

తమిళ కర్ణాటక ప్రాంతాల్లోని సామంత రాజులు ఎదురు తిరిగిన కారణంగా గజపతి రాజులు విజయనగరంపై దాడి చేశారు. శ్రీకృష్ణదేవరాయలు ఉన్న ఆపాటి సైన్యంతో సాహసోపేతంగా వారి నెదిరించి, ఓడించి తిప్పి కొట్టాడు. సామంతులపై దండయాత్రలకి వెళ్ళి కొన్ని తమిళ ప్రాంతాలలో విజయాల్ని, కొన్ని కర్ణాటక ప్రాంతంలోని అపజయాల్నీ మూటగట్టుకొని తిరగి వచ్చిన వీరనరసింహరాయలు సోదరుడు శ్రీకృష్ణదేవరాయలు గజపతిరాజులపై విజయం సాధించి ప్రజలలో పొందిన ఖ్యాతి చూసి ఓర్వలేక, రాయలను కడదేర్చమని మహామంత్రికి ఆదేశమిచ్చాడు.

మహామంత్రి తిమ్మరుసు శ్రీకృష్ణదేవరాయలను ఓ భూగర్భ నివాసంలో దాచి, రాయలను

వధించినట్టుగా వీర నరసింహరాయలకు కొన్ని ఋజువులు చూపాడు. వీరనరసింహరాయలు 1509లో మరణించగానే, తిమ్మరుసు అజ్ఞాతంలో ఉంచిన కృష్ణదేవరాయలను బయటకు రప్పించి, ప్రజామోదంతో గద్దె నెక్కించాడు. శ్రీరంగపురరాజు చిక్కరాయల పుత్రి తిరుమలాంబ రాయలకు పట్టమహిషికాగా, నృత్య సంగీతములందాసక్తి కల చిన్నమదేవి రెండవ భార్య అయినది. రాయలు ప్రజారంజకంగా రాజ్యమేలసాగాడు. అంతేకాక ఆయన సాహిత్య సామ్రాజ్యాన్ని కూడా అష్టదిగ్గజాల సహాయంతో నిర్మించసాగాడు.

❁ ❁ ❁

రామకృష్ణుడు ధ్యానం చాలించడానికి ప్రయత్నించాడు. కానీ కాళి అతన్ని బంధించి పడవైచి, భవిష్యత్ చూడకుండా ధ్యానం ముగించడానికి వీలులేదని శాసించింది.

విజయనగర సామ్రాజ్యం కౌమారదశలో ఉన్నప్పుడు రాయచూరు, ముద్గల్లు దుర్గాలని బహమనీ సుల్తానులూ, కొండవీడు దుర్గాన్ని గజపతి రాజులూ కైవశం చేసుకున్నారు. ఇతర ఆక్రమిత దుర్గాలపై విజయం సాధించిన సాళువ నరసింహరాయలు ఈ పై మూడింటినీ సాధించలేక, ఎవరైతే ఈ దుర్గాలని తిరిగి జయిస్తారో వారే విజయనగర రాజ్యానికి నిజమైన వారసులని మరణశాసనం లిఖించాడు. తిమ్మరుసు ఈ మరణశాసనాన్ని రాయల దృష్టికి తీసుకువచ్చి ప్రోత్సహించాడు.

ఆ సమయానికి గోవా విషయమై పోర్చుగీసులకూ, బహమనీ సుల్తానులకూ మధ్య జరిగిన ఘర్షణలో పోర్చుగీసులకు అండగా నిలిచి, రాయలు వారి సహాయంతో మేలుజాతి అశ్వాల్ని కొనుగోలు చేశాడు. రాయలు చేసిన రాయచూరు యుద్ధంలో బహమనీ సుల్తానుల ధాటి కాగలేక విజయనగర సైన్యం వెన్ను చూపింది. శ్రీకృష్ణదేవరాయలు తన పరుష భాషణలతో సైనికులను ప్రభావితం చెసి, తిరిగి రణరంగ ప్రవేశం చేసి విజయం సాధించాడు. ఈ పోరులో పోర్చుగీసు తుపాకీసేన రాయలకు సహాయంగా నిల్చింది. బహమనీ సుల్తానులు ముద్గల్లు దుర్గాన్ని దౌత్యంలో సమర్పించుకున్నారు.

రాహుత్తరాయగజపతి అధీనంలో ఉన్న ఉదయగిరి కోటను ఏడాది పాటు దిగ్బంధనంలో ఉంచి, చివరకు కోటలోకి పాలు పెరుగులు తీసుకువెళ్ళే గొల్లల ననుసరించి వెళ్ళి, ఓ రహస్య బిలమార్గం ఉనికిని గ్రహించి, తద్వారా రాయల సైనికులు దుర్గప్రవేశం చేసి స్వాధీనపరచుకున్నారు. గజపతిరాజు బందీ చేయబడ్డాడు.

కొండవీడు దుర్గం ప్రతాపరుద్ర గజపతి ఆధీనంలో ఉండేది. ఆ దుర్గాన్ని జయించడానికి రాయలకు చాలా కష్టమైంది. సరి ఎత్తు మంచెల నిర్మాణం కావించి, వాటిపై నుంచి దుర్గపు ప్రహరీలపై నున్న గజపతిరాజుల సేనని లొంగదీసుకుని, దుర్గ ప్రవేశం చేసి కోట ద్వారాలు తెరిచారు. ప్రతాపరుద్రుని కుమారుడు వీరభద్రగజపతిరాజు సాహసంగా యుద్ధం చేసి బందీ కాబడ్డాడు. రాయలు కరుణించి అతణ్ణి విముక్తుణ్ణి చేశాడు. అవమానం సహించలేని ప్రతాపరుద్ర గజపతిరాజు మరల పోరు సల్పాడు. ఆ యుద్ధంలో అతన్ని ఓడించి రాయలు అతని కూతురూ,

వీరభద్రగజపతి సోదరీ అయిన అన్నపూర్ణని వివాహమాడి, కయ్యానికి స్వస్తి చెప్పి వియ్యమందాడు.

అటుతర్వాత రాయలనెన్నో యుద్ధాలలో విజయలక్ష్మి వరించగా కొండపల్లి, అద్దంకి, వినుకొండ, తంగేడు, కేతపరం ఇత్యాది దుర్గాలను వశపర్చుకొన్నాడు. కనిగిరిని వశం చేసుకొని తెలంగాణా ప్రాంతంలో కూడా రాజ్యవిస్తరణ చేశాడు. ఈ విజయపరంపరలకు చిహ్నంగా సింహాచలంలో విజయస్తంభ ప్రతిష్ఠాపన చేసి, స్వామికి నవరత్న ఖచితమైన ఆభరణాల్ని సమర్పించుకున్నాడు.

కర్ణాటకలో విజయం సాధించి శివసముద్రం, ఉమ్మత్తూరు ఇత్యాది ప్రాంతాలను విలీనం చేసుకొని, శ్రీరంగపట్టణంలో రాజప్రతినిధిగా చిక్కదేవరాయల్ని నియుక్తుణ్ని చేశాడు. శ్రీరంగపట్టణంలో కృష్ణదేవరాయ ధ్వజస్తంభ నిర్మాణం కావించబడ్డది. తమిళ రాజ్యంలో కూడా తన ముద్ర వేసి, శ్రీరంగనాథుని ఆలయానికి ప్రవేశగోపుర నిర్మాణం కావించాడు. అదే కృష్ణరాయ గోపురంగా ప్రసిద్ధిగాంచింది.

బహమనీ సుల్తానులూ, గజపతిరాజులూ సామంతులుగా మారారు. కృష్ణదేవరాయలు పోర్చుగీసుల సహాయంతో విజయనగర సామ్రాజ్యంలో ఎన్నో నీటిపారుదల పథకాల్ని చేపట్టాడు. నౌకాయానంలో తర్ఫీదు నిప్పించాడు.

కృష్ణదేవరాయల సైన్యాధిపతి నాగమనాయకుడు రాజాజ్ఞ మేరకు మధురనేలే పాండ్యరాజుకు సహాయార్థమై వెడలి. తంజావూరు చోళులతో తలబడి జయించి, మధురలో తానే ప్రభువుగా ఏలసాగాడు. నాగమనాయకుని కుమారుడు విశ్వనాథనాయకుడు, తండ్రి రాయలకు చేసిన ద్రోహమున కాగ్రహించి, రాయల అనుమతితో తండ్రితో యుద్ధం చేసి బందీని కావించాడు. రాయలు నాగమనాయకుణ్ణి క్షమించి వదిలివేసి, విశ్వనాథనాయకుణ్ణి మధుర రాజప్రతినిధిగా నియమించాడు.

కృష్ణదేవరాయల పెద్ద అల్లుడు - ఆదోని ప్రభువైన అరవీటి అళియ రామరాయలు. రెండవ అల్లుడు - అతని సోదరుడైన తిరుమల దేవరాజు. కృష్ణదేవరాయలు 1524 సంవత్సరంలో అర్ధశతకం వయసు చేరుకున్నాడు. అప్పుడు తన ఆరేళ్ళ వయసులోకల పెద్దకొడుకు తిరుమల దేవరాయలకు పట్టంగట్టి, తిమ్మరుసుని సలహాదారునిగా ఉంచుకొని తాను మంత్రిత్వమును కొనసాగించాడు. అయితే ఎనిమిది నెలల్లోనే తిరుమల దేవరాయలు అకస్మాత్తుగా మరణించడంతో మాజీ మహామంత్రి తిమ్మరుసు అతని మరణానికి బాధ్యుడన్న వార్త హాలాహాలంలా వ్యాపించింది. శ్రీకృష్ణ దేవరాయలు పూర్వాపరాలు ఆలోచించకుండా తిమ్మరుసును బంధించి, కళ్ళు పొడిపించి అంధుణ్ణి చేశాడు.*

* (శ్రీ గుత్తి చంద్రశేఖరరెడ్డిగారు ఈ సంఘటన సత్యదూరమని తమ 'శ్రీకృష్ణరాయ'మనే చిన్న పద్యకావ్యంలో చెప్పడం జరిగింది. కాదు, వాస్తవమేనని మరికొందరు చెప్పారు. ఏది ఏమైనా ఈ సంఘటనని ముగింపు కోసం ప్రస్తావించడం జరిగింది. - రచయిత)

రాయల రెండవ తనయుడప్పటికి రెండేళ్ళ బాలుడు. రాయలు రాజ్యశ్రేయస్సు కోరి రాజ్యంగ వ్యవహారాలను చూడ, సోదరుడు అచ్యుతదేవరాయల్ని నియుక్తుణ్ణి చేశాడు. ఈ సంక్షోభ సమయంలో బహమనీ సుల్తానులు మరోసారి తలెత్తారు. శ్రీకృష్ణదేవరాయలు వారిని తరిమికొట్టాడు. తర్వాత అనతికాలంలోనే, 1530లో తనువు చాలించాడు.

అచ్యుతదేవరాయలు అసమర్థుడు కావడం వల్ల అతని బావమరిది సలకము తిమ్మయ్య, అచ్యుతదేవరాయల పుత్రుడు వెంకటాద్రిని వధించి అధికారం స్వాధీనం చేసుకొన్నాడు. కృష్ణదేవరాయల పెద్దల్లుడు అళియ రామరాయలు తిమ్మయ్యను వధించి, కృష్ణదేవరాయల మరో సోదరుడు సదాశివరాయల్ని గద్దె నెక్కించాడు. సదాశివరాయలు 1542 నుంచి 1560 వరకూ అళియ రామరాయలూ, 1565 నుండి 1569 వరకూ అతని సోదరుడు అళియ తిమ్మదేవరాజూ రాజప్రతినిధులుగా వ్యవహరించారు. సదాశివరాయల మరణానంతరం తిమ్మదేవరాజు 1569లో ప్రభువు పదవి పొందాడు. ఈ విధంగా విజయనగర సామ్రాజ్య పాలన తుళు వంశం నుండి అరవీటి వంశానికి సంక్రమించింది. అళియ రామరాయలు ప్రాణాలు కోల్పోయింది 1565లో సుల్తానులతో జరిగిన తళ్ళికోట యుద్ధంలో. ఆనాటి నుంచి విజయనగర సామ్రాజ్యం క్షీణించసాగింది. క్రమేపీ ముక్కలవుతూ పోయిన విజయనగర సామ్రాజ్యాన్ని అరవీటి వంశ ప్రభువులు 1680 వరకూ పాలించారు.

1336 సంవత్సరంలో ఆరంభమైన విజయనగర సామ్రాజ్యం దాదాపు రెండున్నర శతాబ్దాల తర్వాత 1680లో అంతమైంది. 1509 నుంచి 1530 వరకూ రెండు దశాబ్దాల పైచిలుకు కాలం పాటు సాగిన శ్రీకృష్ణదేవరాయల పరిపాలన, కర్ణాటాంధ్ర విస్తృతమైన విజయనగర సామ్రాజ్యానికి స్వర్ణదశని కలిగించింది.

సామ్రాజ్యమంటే అంతరించింది కాని, ఆ సాహిత్య చక్రవర్తి చల్లని నీడలో అష్టదిగ్గజాలు రచించిన మహాకావ్యాలు ఆంధ్రసాహిత్యసరస్వతికి నిత్యనూతన కావ్యాభరణాలుగా నిలిచాయి.

❁ ❁ ❁

రామకృష్ణుడు భారమైన హృదయంతో ధ్యానం నుంచి మేలుకొన్నాడు.

ఆ మర్నాడు పేరోలగంలో శ్రీకృష్ణదేవవరాయలు రామకృష్ణుని ప్రశ్నించాడు.

"తెనాలిరామా! కాళీమాత ఏమన్నది?"

"నిన్న నన్ను మందలించిన తిమ్మరుసు మహామంత్రే మీతో ఎన్నో యుద్ధాలు చేయిస్తాడు! విజయలక్ష్మి మిమ్ములను వరిస్తుంది. రాబోయే కాలంలో మీరు కర్ణాటకులనీ, ఆంధ్రులనీ వివాదం మాటి మాటికి తలెత్తుతుంది. ఇంతకన్నా ఘనత ఏం కావాలి ప్రభూ, మీకు?!" అన్నాడు రామకృష్ణుడు వినమ్రతతో.

సభ ముగిసిన తర్వాత రామకృష్ణుడు వీలు చూసుకొని, సజల నయనాలతో మహామంత్రి తిమ్మరుసుకి పాదాభివందనం చేసి, వడివడిగా అడుగులు వేసుకొంటూ వెళ్ళిపోయాడు. తిమ్మరుసు విస్తుపోతూ, వెళ్ళిపోతున్న రామకృష్ణుని వైపు చూస్తూ ఉండిపోయాడు. ❁